


కథ

# జేబుదొంగ

—ఐతా-చంద్రయ్య

వెయ్యి రోజులు చెమటోడ్చి పంజేసిన జీతం డబ్బులు పర్సులోకొచ్చేసాయి. డబ్బుల్తో కడుపుబ్బిపోయిన పర్సు అలవోకగా ఆవులించింది. దాని మూతి మూసేసి పాంటు జేబులో వేసుకున్నాడు హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామి. అంతదాకా ఆరేసిన మసిగుడ్డలాగున్న మొహం అరవిరిసిన గులాబీలా వెలిగిపోయింది.

ఉద్యోగ పర్వంలో ప్రవేశించి పదిహేనేళ్లు దాటింది. అంటే... ఇప్పటికి నూట ఎనభైసార్లు జీతం వచ్చింది. కాని... తిన్న అన్నమే రోజూ తింటున్నా పాత పెళ్లాంతోనే రోజూ సంసారం చేస్తున్నా... ఎప్పటికప్పుడు అదో అనుభూతి. అలాగే నెలనెలా జీతం వస్తున్నా ఆ ఒక్క రోజు అనుభూతే వేరు.

ఏదో శంకుస్థాపన నెపంతో పట్టణానికొచ్చిన మంత్రిగారు తమ అధికార పార్టీ అధికార సభ్యులతోనూ, చీలికవర్గం నాయకులతోనూ సంప్రదింపులు జరిపి ఊరు దాటేసరికి మధ్యాహ్నం పన్నెండైంది. అతన్తో సహా పోలీసు యంత్రాంగం మొత్తం గుండెలనిండా ఊపిరి పీల్చుకుంది. యస్సైగార్ని పంపించి టూటౌన్ స్టేషన్‌కొచ్చేసరికి ఎండమండిపోతుంది. పాత స్టేషన్లో కొత్త యస్.ఐలా చిటపటలాడిపోతుంది.

ఫాన్ వేసుకొని సీట్లో కూచోగానే ఒళ్లు [illegible] హాయిగా ఉంది. ఇంకా స్పేపలాగే ఉంటే నిద్ర కూడా రావచ్చు. కాని కోటీశ్వరుని చూచి కోపంగా నవ్వుకున్న తీవ్రవాదిలా కరెంటు పోయింది. ఇహ ఉండరాదు. స్టేషన్లో ఉంటే లాభంలేదు. ఉసూరుమంటూ సైకిలెక్కాడు ఇంటికి చెక్కెయ్యాలనుకున్నాడు. సైకిల్ పరుగెత్తుతూంది బుర్రలో ఏదో మెదుల్తూంది. బస్టాండ్‌దాకా వచ్చేసరికి షడెన్గా చాయ్ తాగాలన్పించింది.

ఇంత బతుకూబతికి ఇంటెన్క వచ్చినట్టు- ఇన్నేళ్ళు పోలీస్ డిపార్టుమెంట్‌లో పంజేస్తూ సొంత డబ్బుల్తో చాయ్ తాగాల్నా! అవమానం. కానిస్టేబులెవడన్నా చూస్తే లేదా పాత కేడీగాడెవడన్నా మధ్యలో వచ్చినా... పోలీస పరువుపచ్చకర్పూరంలా హరించుకుపోతుంది.

ఆనంద్ భవన్ ముందు సైకిలాగింది. హోటల్లో అడుగుపెట్టగానే జనార్దన్ కన్పించాడు. ఆహా! అపర శిబిచక్రవర్తిలా కన్పించాడు ప్రాణం లేచొచ్చింది.

'ఏం రా తమ్మీ... జనార్దన్... ఏం సంగతులూ?' పక్కన కూచున్నాడు.

జేబులు కత్తిరించడంలో జగాన్ని జయించిన మేటి కళాకారుడు జనార్దన్.

'ఏం లేదన్నా... ఇప్పుడే వచ్చిన చాయ్ తాగుదామా?' వినమ్రంగా అడిగాడు.

'చాయ్‌నా!... ఎండలేమో దండిగున్నయ్. గీ ఎండపూట చాయ్ ఏం బాగుంటదీ! కూల్ డ్రింకైతే జర పానం చల్లబడ్తది గదా!'

'ఓ దాందేముందీ... తాగేద్దామన్నా!'

'అంటే... ఏదీ తినక ముందే తాగుదామా?'

'ఏం తిందామన్నా... ఇయ్యాళ్ల గిరాకి లేదు. నా మనసు మారిపోతుంది.'

'అవన్నీ నాకు జెప్తవా! రానీ.... చికెన్ బిర్యానీ తిందాం తమ్మీ... అరె... నెలకొక్కసారన్నా కోడి బిర్యాని తినకపోతే ఏం బతుకురా?' భుజమ్మీద చెయ్యేసి కళ్ళలోకి చూచాడు.

జనార్దన్ ఐస్లైపోయాడు. చికెన్ బిర్యానీకి ఆర్డరిచ్చాడు. ఆవురావురుమంటూ తినేశారు.

కూల్‌డ్రింక్స్ కార్డరైంది.

''ఏంరా జనన్నా! ఈ నడుమ కన్పిస్తనేలేవు. ఊర్లో లేవా?' వీపు నిమిరాడు.

ఓ నిమిషందాకా జవాబు రాలేదు. జనార్దన్ మొహం అదోలాగైంది.

'ఏమైంది తమ్మీ! వేరే ఊర్లో జేబుగొట్టి జైలుకుపోయొచ్చినవా?'

''కాదన్నా...''

''మరేమైంది తమ్మీ?''

''ఈ సిద్దిపేటకూ నాకూ రుణం తీరిపోయిందన్నా!''

షాక్ తగిలినట్టయింది వెంకటస్వామికి.

''ఏం రా... ఎందుకూ?''

''ఏం లేదన్నా మొన్న మా ఊరి నుండి వచ్చిన కొన్ని రోజులక్కడనే ఉన్న.''

''గా పల్లెటూర్ల జేబులుగొడ్తే... ఇంగ నువు బతికినట్టే... మమ్మల్ని బతికించినట్టే.''

''అది కాదన్నా... నాకు పెండ్లీ ఖాయమైంది. జేబులు గొడ్తలేను. పెండ్లిజేసుకొని కట్నం డబ్బుల్తోని ఏదన్నా యాపారం జేస్కుంటా.''

అసలు షాకు ఇప్పుడు తగిలింది.

''అరె... గట్లంటే ఎట్లరా? నువ్వు లేకుంటే మా ఆదాయం పడిపోతదిరా. అసలూ... జేబులు గొట్టడంలో నిన్ను మించిన మొనగాడు మా టూటౌన్ ఏరియాలనే కాదుగదా హోల్ మొత్తం మన జిల్లాలోనే ఎవడూలేడు తెల్సా! నీ గురించి మేము చాలాసార్లు మాట్లాడుకుంటుంటాం.''

''గిట్ల... దొంగ బతుకింకెన్నేండ్లన్నా? రోజంతా బస్టాండ్ల జేబులుగొట్టాలె. రాత్రికి మీకు సగం పంచియ్యాలె. దొరికిపోతే పబ్లిక్ మా పక్క బొక్కలిరగ్గొడ్తున్నరు. మిగిలిన బొక్కలు మీ లాఠీ దెబ్బలకిరిగిపోతై. గిట్ల మా జేబుదొంగల బతుకు తెల్లారిపోతది. ముసలితనంలో ఎవ్వడూ దగ్గరికి రానియ్యడు. బిచ్చమెత్తుకోవాలె.''

''అరె... పూర్తిగా మారిపోతున్నావురా!''

''ఔనన్నా... మారిపోయిన గీ దొంగ బతుకు నాకొద్దిహ. ఇది నేను నీకు తాగించే ఆఖరి కూల్‌డ్రింక్ బస్.''

ఇద్దరూ కూల్‌డ్రింక్స్ తాగేస్తున్నారు.

''అరరే... బంగారమసుంటి దొంగబుద్ధి బజార్ల పారేసుకున్నావా? గట్ల నిర్ణయించుకున్నావేందిరా?''

''ఔనన్నా! ఇగో... బ్యాగుతోసహా వచ్చిన. ఇక్కణ్ణుంచి బస్సెక్కిపోతా. కాళ్ళ వద్దవున్న ఎయిర్ బ్యాగ్‌ను కళ్లతో చూపించాడు.''

''మీరు నాకెంతో సాయం జేసిన్రన్నా, ఎన్నిసార్లు పట్టుబడ్డా కన్నతండ్రోలె... అందరి ముంగిట కొట్టి చాటుకు విడిపించిన్రు. మీ సాయం ఈ జన్మల మరువలేనన్నా!''

జనార్దన్ కళ్లల్లో నీళ్లు దిరుగుతాయి. చలించిపోయాడు వెంకటస్వామి, కడుపులో దేవినట్లైంది.

''పొద్దుగాలలేచి ఎవల మొఖం జూచిన్నో... నాకిది చెడ్డవార్త!'' అంటూ ఎందుకైనా మంచిదని పాంటు జేబు తడిమి చూచుకున్నాడు. పర్స్ భద్రంగా ఉంది. బరువెక్కిన గుండెల్తో బయటికొస్తుంటే జనార్దన్‌ను గుండెలకు హత్తుకోవాలన్పించింది కాని... బాగున్పించలేదు.

ఇరవై రూపాయల నోటు వెంకటస్వామి చేతిలో పెట్టి నమస్కరించాడు జనార్దన్.

''ఇంగ వస్తనన్నా!''

''సరేరా... సల్లగా బతుకు తమ్మీ!'' అంటూ మరోసారి జేబు తడుముకున్నాడు పర్స్ క్షేమంగా ఉంది.

ఇంటికెళ్లగానే ఇల్లాలు ఎదురొచ్చింది. చిరునవ్వులు చిందిస్తూ.

''ఇగో... ఇది నా నెల జీతం... తీస్కో... పైసలు జెర జాగ్రత్తగా ఖర్చుపెట్టు'' పర్సు అందించి డ్రెస్సు మార్చుకుంటున్నాడు. వికలమైన మనస్సులో జనార్దన్ మెదుల్తున్నాడు.

పర్సు చేతిలోకి రాగానే ఇల్లాలి మొహం ఇందీవరములా విచ్చుకుంది. పర్సు విప్పగానే ఆరిపోయిన హారతి పళ్లెమైపోయింది. వెంకటస్వామికి వెర్రి లేదుగదా!

''ఇదేందయ్యో... ఖాళీ పర్సు... మజాక్ చేస్తున్నావా? రుసరుసలాడుతూ పర్సు విసిరేసింది.

హెడ్‌కానిస్టేబుల్ హెడ్డులో కోడిగుడ్డు దొర్లింది.

''అరె... ఇది నా పర్సుకాదు. గిది నాజేబులకొట్లొచ్చిందబ్బా! మరి నా పర్సేమైందీ?'' ఆందోళనగా పర్సునటూ ఇటూ తిప్పి చూశాడు.

''ఎవడో మాయం జేసిండు, చేసేది పోలీస్ నౌకరి చూసేది ఆడపోరీల్ని. కాలేజి పోరి కన్పిస్తే కంట్లో కారంగొట్టినట్టాయె. కాలు కదలదాయె...'' భార్య ధుమధుమలు. పుండుమీద పచ్చికారం పూసినట్లైంది. కాని ఏం చెయ్యాలి?

''హోరి నా కొడుకా... జనార్దనా... ఎంత పంజేస్తివిరా... ఎంత నాటకమాడ్తివిరా!... ఇంతకీ నీదే ఊరూరా...! గొణిగాడు. మింగలేక కక్కలేక సతమతమై... గుడ్లు మిటకరిస్తున్నాడు.